యువకుడి ఆత్మహత్య

ఉప్పల్: ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాల ప్రకారం.. నంద్యాలకు చెందిన దాసరి శ్రీకాంత్ (25) భార్య సుహాసినితో కలిసి చిలుకానగర్‌లో ఉంటున్నారు. శ్రీకాంత్ పెయింటర్ కాగా.. భార్య ప్రైవేటు ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తుంది. వీరికి ఇద్దరు కుమారులు. సోమవారం రాత్రి భోజనం అనంతరం నిద్రకు ఉపక్రమించారు. తెల్లవారుజామున దాహం వేయడంతో నిద్రలేచిన భార్య పక్క గదిలో భర్త ఉరేసుకుని ఉండటాన్ని గమనించి స్థానికుల సాయంతో కిందకు దించి ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



అల్వాల్: దేశవ్యాప్తంగా పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన విద్యార్థి విజ్ఞాన్ మందన్ (వీవీఎం) ప్రతిభా పరీక్షల్లో అల్వాల్‌కు చెందిన త్రివేణి స్కూల్ విద్యార్థిని గుడి లాస్య ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాల సీఆర్‌ఓ వెంకటరావు విద్యార్థినిని అభినందించారు. విద్యార్థిని తల్లిదండ్రులు రాధాసతీష్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితను కలిసిన విద్యార్థి నేత

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ ఇందిరానెహ్రూనగర్‌కు చెందిన బీఆర్‌ఎస్ మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షులు రామచర్ల నర్సింగ్ మంగళవారం ఎమ్మెల్సీ కవితను మర్యాదపూర్వకంగా కలిసి స్థానిక సమస్యలపై చర్చించారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



నాచారంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు



ఆనంద్‌బాగ్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద..

మల్లాపూర్: నాచారం డివిజన్ బీజేపీ అధ్యక్షులు ప్రకాష్ ఆధ్వర్యంలో మంగళవారం నాచారంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు మల్లెల నర్సింగ్‌రావు, అధికార ప్రతినిధి గోపాల్‌గౌడ్, కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు మోహన్‌రెడ్డి, నాయకులు నవీన్, గోపి, అంజి, శ్రీధర్‌రెడ్డి, వెంకటేష్, దయాగౌడ్, ప్రతాప్‌రెడ్డి, కృష్ణ, శేఖర్, మంజులవాణి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగం దేశ చరిత్రలోనే గొప్పది..

మల్కాజిగిరి: రాజ్యాంగ దినోత్సవాన్ని ఆనంద్‌బాగ్‌లో ఘనంగా నిర్వహించారు. మంగళవారం అంబేడ్కర్ విగ్రహంతో పాటు నేరెడ్‌మెట్ అంబేడ్కర్ భవన్‌లో చిత్రపటానికి నివాళులర్పించారు. త్యాగరాజు మాట్లాడుతూ.. భారతరత్న అంబేడ్కర్ నిర్మించిన రాజ్యాంగం చరిత్రలోనే గొప్పదిగా నిలిచిపోయిందన్నారు. దేశంలో ఏ మతాన్ని నమ్మని వారు కూడా రాజ్యాంగాన్ని నమ్ముతారన్నారు. రాజ్యాంగ ఫలాలు అందరికీ దక్కాల్సిన అవసరం ఉందని, ఆ దిశగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. సీహెచ్.నరేష్, గంగాధర్ కృష్ణ, శ్రీనివాస్, గణేష్, రాజయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని అందరూ గౌరవించాలి..

బోడుప్పల్: భారత రాజ్యాంగాన్ని అందరూ గౌరవించాలని బోడుప్పల్ కమిషనర్ రామలింగం అన్నారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సంవిదాన్ దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ స్ఫూర్తి, విలువలను కాపాడతామని ప్రతిజ్ఞ చేశారు. మేనేజర్ నాగేంద్రబాబు, డీఈ చిరంజీవులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న కమిషనర్ రామలింగం

న్యాయవాదికి అవార్డు



న్యాయశ్రీ అవార్డును అందుకున్న హైకోర్టు న్యాయవాది సుంకర నరేష్

కుషాయిగూడ: కాప్రాకు చెందిన హైకోర్టు న్యాయవాది సుంకర నరేష్‌కు న్యాయశ్రీ అవార్డు వరించింది. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా రవీంద్రభారతిలో మెగాసిటీ నవకళ వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నంద చేతుల మీదుగా అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. న్యాయవాదులు సామాజిక స్పృహ కలిగి ఉండాలని, సమాజంలో అట్టడుగు వర్గాల ప్రజలకు న్యాయం అందించేందుకు కృషి చేయాలన్నారు. ఉచిత న్యాయ సలహా కేంద్రాలు ఏర్పాటు చేసి పేదలు, పేద విద్యార్థులకు న్యాయసాయం అందజేస్తున్న సుంకర నరేష్‌ను ఆమె అభినందించారు. ఈ అవార్డుతో తనపై బాధ్యత మరింత పెరిగిందని, తన సేవలను మరింత విస్తృతం చేసేందుకు పాటుపడతానని అవార్డు గ్రహీత పేర్కొన్నారు. సంస్థ వ్యవస్థాపకులు మల్లికార్జునరావు, దైవాజ్ఞశర్మ తదితరులు పాల్గొన్నారు.

రూ.15 లక్షలతో అభివృద్ధి పనులు



సీసీరోడ్డు పనులను ప్రారంభించిన కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: మల్కాజిగిరి డివిజన్ పరిధిలోని కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తున్నామని కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. బలరాంనగర్‌లో రూ.15 లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. దెబ్బతిన్న రోడ్ల స్థానంలో సీసీరోడ్లు, ఓపెన్ నాలాల స్థానంలో యూజీడీ నిర్మాణానికి తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. అర్జున అపార్ట్‌మెంట్ వద్ద నాలా డీసిల్టింగ్ చేయడంతో పాటు అక్కడక్కడ దెబ్బతిన్న మ్యాన్‌హోల్స్‌కు మరమ్మతుల చేపట్టాలని జల మండలి అధికారులకు సూచించామన్నారు. ఏఈ నవీన్, నాగార్జున, రమేష్, కాలనీవాసులు మండలి రాధాకృష్ణయాదవ్, కుమార్, క్రాంతి, స్వామి పాల్గొన్నారు.

సీసీఎస్ ఏర్పాటు అభినందనీయం



ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసిన సీసీఎస్ ప్రతినిధులు

కుషాయిగూడ: ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చి పరిష్కారం దిశగా చర్లపలి కాలనీల సమాఖ్య (సీసీఎస్) చేస్తున్న కృషి అభినందనీయమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. నూతనంగా ఎన్నికైన సీసీఎస్ కమిటీ ప్రతినిధులు మంగళవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన వారిని అభినందించి ఘనంగా సత్కరించారు. గత నాలుగేళ్లలో సీసీఎస్ పనితీరును సాధించిన ప్రగతిని ఎమ్మెల్యేకు వివరించారు. భవిష్యత్తులో సీసీఎస్ వేదికగా వచ్చే సమస్యలను వందశాతం పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. చర్లపల్లి టర్మినల్ రహదారి కోసం మహాలక్ష్మినగర్‌లోని ఇళ్లు తొలగించి రోడ్డు వేయాలన్న అధికారుల నిర్ణయాన్ని వెనక్కి తీసుకునేలా ప్రయత్నిస్తానన్నారు. సీసీఎస్ అధ్యక్షుడు ఎంపల్లి పద్మారెడ్డి, సురకంటి సత్తిరెడ్డి, గంప కృష్ణ, శ్రీనివాస్‌నాయక్, కట్కూరి బుచ్చిరెడ్డి, పనగట్ల చక్రపాణిగౌడ్, సారా వినోద్, సింగిరెడ్డి నరసింహారెడ్డి, రవి, బర్ల రామచంద్రారెడ్డి, అశోక్, దామోదర్‌రెడ్డి, శివలింగం, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల తొలగింపు ప్రక్రియను వెనక్కి తీసుకోవాలి



ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో మహాలక్ష్మినగర్ వాసులు

కాప్రా: చర్లపల్లి రైల్వే టెర్మినల్ మార్గం కోసం మహాలక్ష్మినగర్ కాలనీలో ఇళ్ల తొలగింపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని స్థానిక కాలనీవాసులు విజ్ఞప్తి చేశారు. చర్లపల్లి కాలనీల సమాఖ్య సీసీఎస్ ఆధ్వర్యంలో మహాలక్ష్మినగర్‌వాసులు మంగళవారం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైల్వే టెర్మినల్‌కు ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నప్పటికీ మహాలక్ష్మినగర్ మార్గాన్నే ఎంచుకోవడంతో చాలామంది ఇళ్లు కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. కాలనీవాసుల విజ్ఞప్తిపై స్పందించిన ఎమ్మెల్యే అధికారుల వారి నిర్ణయాన్ని వెనక్కి తీసుకునేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సీసీఎస్ అధ్యక్షుడు పద్మారెడ్డి, నాయకులు మహేష్‌గౌడ్, సురకంటి సత్తిరెడ్డి, గంప కృష్ణ, శ్రీనివాస్‌నాయక్, బుచ్చిరెడ్డి, చక్రపాణిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు న్యాయం జరగాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి: బీసీ కులగణన ద్వారా బీసీ సామాజిక వర్గాలకు న్యాయం జరగాల్సిన ఆవశ్యకత ఉందని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా క్యాంప్ కార్యాలయంలో బీసీ సంఘాలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కులమతాలకు అతీతంగా బీసీలకు న్యాయం జరగాలన్న చర్చ జరగాలన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో 43 శాతం స్థానిక ఎన్నికలతో పాటు ఇతర ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. సుమారు 10 నెలల తర్వాత హైకోర్టు ఆదేశాలతో డెడికేషన్ కమిటీ ఏర్పాటు చేశారన్నారు. ప్రభుత్వం నుంచి సర్క్యులేషన్ పంపించారని ఏ విధంగా కులగణన చేయడం, రిజర్వేషన్లు అమలు చేస్తారని తెలియజేశారని సుప్రీంకోర్టు 2001లో వచ్చిన తీర్పును ప్రస్తావించారన్నారు. అందులో 50 శాతం మించరాదని చెప్పిందని, ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే దీనిని ఎందుకు పరిగణలోకి తీసుకోవాలో చెప్పాలన్నారు. 70 శాతం జనాభా ఉన్న బీసీలకు తగిన రీతిలో రిజర్వేషన్లు కల్పించాలని చెప్పారు. కార్పొరేటర్లు, బీసీ సంఘాల నేతలు పాల్గొన్నారు.

విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏసీపీ చక్రపాణి

మల్లాపూర్: విద్యార్థులు, యువత మత్తు పదార్థాలు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని మల్కాజ్‌గిరి ఏసీపీ చక్రపాణి సూచించారు. మంగళవారం తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో నాచారం జాన్సన్ గ్రామర్ స్కూల్‌లో విద్యార్థులకు గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణపై మాట్లాడారు. ముఖ్యఅతిథిగా మల్కాజ్‌గిరి ఏసీపీ చక్రపాణి హాజరై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు సెల్‌ఫోన్ వినియోగాన్ని తగ్గించుకోవాలని సూచించారు. సెల్‌ఫోన్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాలో అనవసరంగా వచ్చే మేసేజ్‌లు, లింక్‌లను ఓపెన్ చేయొద్దని సూచించారు. ఎవరికీ ఓటీపీలను చెప్పకూడదని సూచించారు. సైబర్ నేరగాళ్ల కారణంగా చాలామంది మోసపోతున్నారని, జాగ్రత్తగా ఉండాలన్నారు. నాచారం ఇన్‌స్పెక్టర్ రుద్వీర్‌కుమార్, నార్కోటిక్స్ ఇన్‌స్పెక్టర్ రాంప్రసాద్, ప్రవీణ్, క్రైమ్ సైబర్ సెక్యూరిటీ డీసీపీ అరవింద్‌బాబు, నరేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

కాప్రా: కాప్రాలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సపొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాల ప్రకారం.. కుమార్(40) అనారోగ్యం కారణంగా చికిత్స కోసం ఆసుపత్రిలో వచ్చి చేరాడు. వైద్యుల నిర్లక్ష్యంతోనే అతడు మృతి చెందాడని ఆరోపిస్తూ మృతుడి బంధువులు ఆస్పత్రి ఎదుట ధర్నాకు దిగారు. సదరు ఆసుపత్రి యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకోవాలని ఆందోళన చేశారు. బాధిత కుటుంబసభ్యులతో యాజమాన్యం చర్చలు జరిపి పరిహారం అందజేశారని, దీంతో ఆందోళన విరమించినట్లు తెలుస్తోంది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

బోడుప్పల్: విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు కాలనీల్లో బుధవారం విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏఈ వేణుగోపాల్ ఓ ప్రకటనలో తెలిపారు. 11 కేవీ బృందావన్ కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రాఘవేంద్ర కాలనీలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఉప్పల్: ఉప్పల్ భగాయత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఫీడర్ మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సత్యానగర్, వేంకటేశ్వరకాలనీ, మెహఫిల్ హోటల్, భగాయత్ రోడ్‌నంబర్–3, కాలభైరవస్వామి లేన్, టీఎస్‌ఆర్‌లేన్, హెచ్‌ఎండీఏ లేఅవుట్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ కిరణ్ కుమార్ తెలిపారు.

సామూహిక సత్యనారాయణ వ్రతాలు



రామంతాపూర్: శ్రీ రమా సహిత సత్యనారాయణస్వామి ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా మంగళవారం వేదపండితులు తిరుపతి ఆచార్యుల ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణవ్రతాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించుకుంటే కుటుంబంలో అన్ని శుభాలే కలుగుతాయన్నారు.

పోలీస్ అధికారిపై దాడి !

మల్కాజిగిరి: పోలీస్ అధికారిపై దాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరి సతీష్ ఈనెల 23న హనుమాన్‌పేట్ నుంచి ఉత్తమ్‌నగర్ వైపు కారులో వస్తుండగా దయానంద్‌నగర్ ప్రాంతంలో మరో కారులో వెళ్తున్న వ్యక్తి సతీష్ కారును ఢీకొట్టి పారిపోయాడు. కారులో నుంచి కిందికి దిగిన సతీష్‌పై ద్విచక్రవాహనాలపై వచ్చిన నలుగురు దుండగులు వాగ్వాదానికి దిగి దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో కారు దెబ్బతినడంతో పాటు బాధితుడికి గాయాలయ్యాయి. ఈ మేరకు మల్కాజిగిరి పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కరి సతీష్ పోలీస్ విభాగంలో డీఎస్పీగా పనిచేస్తున్నట్లు సమాచారం.